# అమ్మకడుపు చల్లగా - 2

## - గొల్లపూడి మారుతీరావు



స్వర్గీయ గొల్లపూడి మారుతిరావుగారి ఆత్మకథ 'అమ్మకడుపు చల్లగా' ఇప్పటికి పదకొండు సంవత్సరాలుగా మార్కెట్‌లో ఉన్న సంగతి పాఠకులకు విదితమే. అందులో మారుతిరావుగారు 2007 వరకూ తన జీవితంలో జరిగిన సంఘటనలను అత్యంత ఆసక్తికరంగా పాఠకులకు అందించారు. దానికి కొనసాగింపుగా 2007 నుంచి తనజీవితంలోని ముఖ్యమైన సంఘటనలను, క్రిందటి సంవత్సరమే, వ్రాయడం ప్రారంభించారు. అనారోగ్యకారణాలవల్ల దాన్ని పూర్తిచేయలేకపోయారు. ఆయన వ్రాసిన కొద్దిపేజీలను వ్రాసిన వెంటనే, 20౧8 నవంబర్‌లో, కౌముదికి పంపించారు. పూర్తిచేసి ఉంటే ఆ పుస్తకానికి ఏమి పేరు పెట్టి ఉండేవారో! ఆ అసంపూర్తి రచనను అమ్మకడుపు చల్లగా - 2 గా కౌముది పాఠకులకు ఈ నెల నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**"బి.ఎన్.రెడ్డి జీవితం, కృషి"** అనే విషయం మీద పుస్తకాన్ని రాస్తున్నప్పుడు పూనా ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ నుంచి కొంత సమాచారం కావలసి వచ్చింది. ఎవరు పరిచయం చేశారో గుర్తులేదుకాని అక్కడ చాలాకాలంగా పనిచేస్తున్న ఒక తెలుగాయన్ని పరిచయం చేస్తూ ఆయన ఫోన్ నంబరు ఇచ్చారు. సముద్రాల రఘునాథ్. పేరులోనే తెలుస్తున్నట్టు ప్రముఖ కవి సముద్రాలగారి మనుమడు. ఆయన నాకు చాలా సహకరించారు. ఆ సందర్భంలో పూనా ఫిలిం ఇన్స్టిట్యూట్‌లో జరిగిన ఒక సెమినార్‌లో నేనూ పాల్గొనడానికి నాకు ఆహ్వానం అందింది. రఘునాథ్‌గారు పూనుకోకపోతే నా గురించి అక్కడ ఎవరికయినా తెలుస్తుందనుకోను.

దక్షిణాదినుంచి బొత్తిగా ప్రమేయం లేనిది 'తెలుగు' పరిశ్రమ అని నాకనిపిస్తుంది. మళయాళం నుంచి అరవిందన్, ఎమ్.టి వాసుదేవన్ నాయర్, అదూర్ గోపాలకృష్ణన్ ఇలా చాలామంది తెలుసు. ఇక తమిళంలో కె. బాలచందర్, మణిరత్నం, సేతుమాధవన్ - ఇలా కొందరు తెలుసు. కానీ నాకు తెలిసి తెలుగువారి ప్రాచుర్యం తక్కువ. కమర్షియల్ సినిమాలో పాపులర్‌గా ఉన్న దాసరి, రాఘవేంద్రరావు, తాతినేని రామారావు పేర్లు అక్కడ వినిపించవు. 'శంకరాభరణం' తర్వాత కె.విశ్వనాథ్ తెలుగు జెండాని ఎగరవేశారు. ముఖ్యకారణం వారి భాష హిందీ. ఇనిస్టిట్యూట్‌లో చదువుతున్న చాలామంది ముంబై, ఇతర ఉత్తరదేశపు ప్రాంతాలనుంచి వచ్చినవారు కావడం. ఇదేకాని కాకినాడలో ఉంటే పరిస్థితి వేరుగా ఉండదేమో? పూనా ఫిలిం విద్యార్థిలోకానికి దక్షిణాది సినిమా ప్రముఖుల పేర్లు కూడా తెలీవేమో. 'ఆర్టు' అంటే బొత్తిగా అంటరానివారని నా ఉద్దేశం కాదు. కానీ పూనాలో ఇప్పుడిప్పుడు బొంబాయిలో విజృంభిస్తున్న కమర్షియల్ దర్శకులు, హీరోల ప్రాభవం తెలుస్తుంది. కాగా భాషకూడా ప్రధానమయిన కారణం.

కాగా, ఈ సెమినార్‌కి నాకు ఆహ్వానం రావడం కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది. రఘునాథ్‌గారు ఫోన్ చేసి రెచ్చగొట్టారు. 'మనమేమిటో వీళ్ళకి చెప్పండి' అంటూ.

ఇలాంటి అవకాశమే అపురూపం. కాగా, ఫిలిం ఇన్‌స్టిట్యూట్ చూడాలనే వ్యామోహం, అంతకు మించి పక్కనే ఉన్న షిరిడీ యాత్ర - ఇవన్నీ ఆకర్షించాయి.

సెమినార్‌లో నా ప్రసంగ విషయం: Mythology in Indian Film.

బహుశా ఎవరూ ముట్టుకోని విషయమేమో. ఈ రోజుల్లో పురాణాలు, దేవుళ్ళూ ఎవరికి కావాలి? ఆ తరం - హిందీ పరిశ్రమలో గడిచిపోయింది. అందరికీ అన్నీ వడపోయగా మిగిలిన 'జిడ్డు' ఈ శీర్షిక అనుకుంటాను.

కానీ నాకు మొదటి అవకాశం. తీరికగా కూర్చుని అద్భుతమయిన ప్రసంగాన్ని సిద్ధం చేశాను. చేస్తూనే మిత్రులు డాక్టర్ పప్పు వేణుగోపాలరావుగారికి పంపించాను. వెంటనే నాకందిన ఆయన స్పందన. "ఎంత బాగా రాశారు. I am honoured to read it in Thaliland!"

ఇప్పుడు ఫిలిం ఇన్‌స్టిట్యూట్ ఒకప్పుడు ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు, నటుడు వి.శాంతారాం రాజ్ కమల్ స్టూడియోస్. ఆ స్టూడియోలో నడుస్తున్నంత సేపూ ఎన్ని జ్ఞాపకాలో. ఎన్ని అపూర్వమైన చిత్రాలకు అది పుట్టినిల్లు. నేనూ మా ఆవిడా ఒక మైకంతో నడిచాం. మా పక్కన రఘునాథ్.

ఇక సెమినార్ ఒక పెద్ద సర్కస్. భారతదేశంలోని ఎందరో ప్రముఖులు అక్కడ దర్శనమిచ్చారు. హాజరయిన విద్యార్థులకీ అదొక అపూర్వమైన అవకాశం అనుకుంటాను. అయితే ఈ 'గొల్లపూడి మారుతీరావు' ఎవరో ఎవరికీ తెలియదు. ఏ ఒకరిద్దరో పొరపాటున తెలుగు సినిమా తెలిసినవారు తప్ప ఎవరూ నా వేపు కన్నెత్తయినా చూడలేదు. ఈ సెమినార్ అధ్యక్షులు ప్రముఖ రచయిత, కన్నడ సీనియర్ సినీ నిర్మాత యు.ఆర్. అనంతమూర్తిగారిని పలకరించాను. ఆయన మా ఫౌండేషన్ సభలకి వచ్చారు. The Moral fatigue in Indian Cinema అనే విషయం మీద అద్భుతమయిన "శ్రీనివాస్ స్మారక" ప్రసంగాన్ని చేశారు. ఆ సందర్భం వారికి బాగా గుర్తుంది. హార్దికంగా పలకరించారు. జావేద్ అఖ్తర్‌ని పలకరించాను. భయం భయంగానే. మా ఫౌండేషన్‌కి రావడం గుర్తుందన్నారు. అమ్మయ్య బతికాను. గుల్జార్ ఒకప్పుడు అప్పుడెప్పుడో మహాబలిపురంలో నిర్మాత మల్లికార్జున రావుగారికి 'కళ్ళు' కథ చెప్పాను. గుర్తుందన్నారు. మొహమాటానికా? గోవింద నిహలానీ మా సభలకి వచ్చారు. ఒకసారి జ్యూరీ సభ్యులుగా ఉన్నారు. గుర్తుపట్టారు. ఇంతే పరిచయాలు.

నేను ప్రసంగించే సభకి కమల్‌హాసన్ అధ్యక్షత. మరో ప్రసంగం డాక్టర్ దేవ్‌దత్తా పట్నాయక్ అనే ఆయనది. ఆయన పౌరాణిక విషయాల మీద ఎన్నో పుస్తకాలు రాశారు. ఈ ప్రాంతాలలో ఆయన పాపులర్ అనుకుంటాను. కమల్ విమానం దిగుతూనే అతుల్ తివారీ అనే రచయిత, కార్యకర్తతో అన్నారట. "నాకు వేరే గది అక్కరలేదు. మారుతీరావుతో ఉంటాను" అని. తీరా నా భార్య వచ్చిందంటే గది తీసుకున్నారు.

మధ్యాహ్నం నా సభ. నేను performerని. లేని నిలబడి మైకు దగ్గరికి నడిచాను. తరువాత ఒక అరగంటసేపు ప్రేక్షకుల ఊపిరి తిరగనివ్వలేదు. పామర భాషలో చెప్పాలంటే అదరగొట్టేశాను. అందరూ నిర్ఘాంతపోయి నా ప్రసంగాన్ని విన్నారు. నా అనుభవంలో ప్రేక్షకులు నా చేతిలో ఉన్నారన్న విషయాన్ని గ్రహించడం కష్టంకాదు. ప్రసంగం పెద్ద హిట్. నా తరువాత కమల్ హాసన్ అనే అధ్యక్షుడు నాస్తికుడు. భారతీయ సినిమాలో పౌరాణిక ఇతివృత్తం గురించి, మిత్రుడినయిన నా గురించి క్లుప్తంగా మాట్లాడాడు. నా తర్వాత దేవదత్తా పట్నాయిక్ ఏవో చార్టులు, బొమ్మల ప్రదర్శనతో ప్రసంగించాడు. సభ అయ్యాక నేను రెండు అంగుళాలు ఎత్తున నడిచాను. విద్యార్థులు కొందరు కొత్తగా చూశారు. ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో చేరడమే సినీ రంగానికి పాస్‌పోర్ట్‌లాగా గిరజాల జుత్తులతో, రకరకాల దుస్తులతో విచిత్రమైన రకరకాల కళ్ళద్దాలతో, షోకులతో దర్శనమిస్తున్న కొందరికి ఈ ప్రసంగాలు 'గగన కుసుమాలు' అనుకుంటాను.

విచిత్రమేమిటంటే నాలాగా, దేవ్‌దత్తా పట్నాయిక్‌లాగా మిగతా వ్యక్తులు సిద్ధపడినట్టు అనిపించలేదు. లేక మానసికంగా 'హోం వర్కు' చేసుకుని వచ్చారో జావేద్ అఖ్తర్ అలవోకగా, అనర్గళంగా మాట్లాడారు. నేనూ అంతకంటే అనర్గళంగా మాట్లాడగలను. మర్నాడు

సంజయ్ లీలా బన్సాలీ వచ్చారు ముంబై నుంచి. ఆయన పెద్ద ఆకర్షణ. ఈ కుర్రాళ్ళకి అతను పెద్ద గమ్యం. పూనాలో ఆయన తెలుగు దాసరి. అతని కళ్ళల్లో పడాలి అన్న కుర్రాళ్ళ తపన కనిపించింది. ఆయన గొంతు విప్పితే చప్పట్లు కొడుతున్నారు. అతను ఆడుతూ పాడుతూ మాట్లాడారు. ఆయన మాటలకి ప్రేక్షకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మొత్తం మీద 'హిందీ' రాజ్యమేలే ప్రాంతంలో హిందీ కళాకారుల, టెక్నీషియన్ల హవా చెల్లుబాటయింది. రఘునాథ్ కూడా ఈ విషయాన్ని ముందుగానే సూచించారు.

ఏమయినా వచ్చినపని మర్యాదగా, బాధ్యత చేసిన తృప్తినాది.

ఆ సాయంకాలం స్టూడియో వెనుక నున్న చెట్ల గుబుర్ల మధ్య ఖాళీ స్థలంలో ఇన్స్టిట్యూట్ విద్యార్థులు షేక్స్‌పియర్ "మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్" నాటకాన్ని ప్రదర్శించారు. ప్రదర్శన చాలా బాగుంది. మా పక్కన యు.ఆర్ అనంతమూర్తిగారు. నా ప్రసంగాన్ని ఆయన చాలాబాగా మెచ్చుకున్నారు.

"నాకు మీ ఆశీర్వాదం కావాలి" అన్నాను.

"నేను మీకంటే పెద్దవాడిని. ఐ యామ్ డూయింగ్ జస్ట్ దట్" అన్నారు.

శివానీని పరిచయం చేశాను. ఆయన లోగడ మా ఫౌండేషన్ సభకి వచ్చారు కనుక నేపథ్యం తెలుసు. ఆమె రెండూ చేతులూ పట్టుకుని "You are a great mother. కొడుకు పోయిన దుఃఖాన్ని మనసులోనే పెట్టుకుని మంచిపని చేస్తున్నావు" అన్నారు.

"I am no great mother. But my son made me great" అంది శివాని. బహుశా ఆమె జీవితంలో అంత గొప్ప స్పందన వ్యక్తం చేయడం అదేనేమో?

మరునాడు ఉదయం కమల్ హాసన్ నా హోటల్ గదికి వచ్చారు. ముందు రోజు నా కీ నోట్ అడ్రస్ బాగుందన్నారు. కమల్ నాస్తికుడు. నా ప్రసంగం పౌరాణిక చిత్రాల మీద. బాగున్నది ప్రసంగం మాత్రం. జబ్బార్ పటేల్ అనే దర్శకులు, ముంబైలో ఒకే కేంద్రాన్ని నడుపుతున్న అంజాన్ రాజబలీ అనే రచయితా నా ప్రసంగాన్ని మెచ్చుకున్నారు. గుల్జార్, అతుల్ తివారీ లిఫ్టులో కలిశారు. వాళ్ళిద్దరు కూడా నా ప్రసంగాన్ని మెచ్చుకున్నారు. "My audience is very illustrated and a rare one. When will I get a chance like this" అన్నాను. పనిలో పని గుల్జార్ గారిని ఫౌండేషన్ సభకి ఆహ్వానించాను. కానీ ఆగష్టు నెలలో ఆ తేదీలలో ఆయన పుట్టినరోజో, మరేదో ఉంది. ఏ సంవత్సరమూ వీలుపడదని తేలింది. ఆ విధంగా శ్రీనివాస్ ఫౌండేషన్ గుల్జార్‌ని నష్టపోయింది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments